★ చెల్లి ★

"సాయినాథ శాస్త్రి"

చెల్లీ! చెల్లీ!! చెల్లీ!!!

నీకోసం నేనెంత ఏడుస్తున్నానో చూశావా? నువ్వు కావాలని నీకోసం ఎంతగానో ఆరాటపడి తపించిపోయాను. బుల్లిబుల్లి పాపాయిల్ని చూసినప్పుడల్లా నాక్కూడా ఒక చెల్లాయి వుంటే – అనిపించేది. అందుకనే చిన్నప్పుడు – అంటే నువ్వింకో సంవత్సరానికి పుడతావనగా నేను అమ్మని అడిగేవాణ్ణి – "అమ్మా! నాకు చెల్లాయి కావాలే!" అని. అమ్మ నేనడుగుతుంటే నవ్వి నన్ను కావలించుకుని గట్టిగా ముద్దుపెట్టుకునేది. మన ఎదురింటి పాప వాళ్ళ చెల్లి నెత్తుకుని అందరిళ్ళకీ వెళుతూండేది. నాక్కూడా అట్లాగే ఓ చెల్లాయి నెత్తుకుని తిరగాలనిపించేది. మనింట్లో అమ్మా, నాన్నా, తాతా అంతా కూడా పెద్దవాళ్ళేనయ్యె! నాతో ఆడుకునే వాళ్ళే లేరు. నువ్వే చెప్పు – అలాంటప్పుడు బాధగా వుండదు చెల్లీ? అందుకే నాతోపాటుగా ఆడుకునేందుకు నువ్వుంటే బాగుంటుందనిపించింది చెల్లీ!

అమ్మ ప్రతిరోజూ తులిసెమ్మ దగ్గిర పూజ చేసుకునేది. నేనుకూడా రోజూ అమ్మ పక్కనే కూచుని దేవుఁడికి దణ్ణం పెడుతూండేవాణ్ణి. ఓరోజున నాన్నారు అడిగారు – "బాబ్జీ! దేవుడికి ఏం కావాలని దణ్ణం పెడుతున్నావురా?" అని. నేను వెంటనే తపీమని చెప్పేశాను – "దేవుఁడూ! మరే! నాకో బుల్లి చెల్లాయినివ్వవూ!" అని దణ్ణం పెడుతున్నానని. నా మాటలు వింటంతోనే నాన్నారు నన్నెత్తుకుని నవ్వుతూ నా బుగ్గ గిల్లి ముద్దుపెట్టేసుకున్నారు. అసలు నాన్నారు ఎప్పుడూ అంతే! నేనేం చేసినా, ఏం అడిగినా నా బుగ్గలు గిల్లేసి ముద్దుపెట్టుకుంటూ వుంటారు చెల్లీ! ఎందుకో మరి నాకూ తెలియదు.

ఆరోజు రాత్రి నిద్ర మెలకువ వచ్చి లేచాను. అమ్మ కనిపించలేదు. అంతవరకు ఎప్పుడూ నా దగ్గిరే పడుకునేది. నాకు భయంవేసింది. "అమ్మా!" అని గట్టిగా పిలిచాను. నాన్నారొచ్చి నన్నెత్తుకున్నారు. 'అమ్మే'దని అడిగాను. ఇంతలో కొట్టు గదిలోంచి ఎవరో చిన్నగా పాపాయిలాగా ఏడుస్తున్నట్టు వినిపించింది. గభాల్న నాన్నారి చేతుల్లోంచీ దిగి, గదిలోకి పరిగెత్తాను. గదిలోనేవున్న మంత్రసాని లక్ష్మి నావంక చూసి నవ్వుతూ "చెల్లి! బాబూ!" అంది. అప్పుడు నాకెంత సంతోషం కలిగిందని చెల్లీ! - చెప్పలేననుకో!

చెల్లీ! నువ్వెట్లా వున్నావని? గులాబీపువ్వల్లే వున్నావు. కళ్ళుతెరిచి చూస్తుంటే నాకెంతో సంబరమనిపించింది. నిన్ను చూట్టంతోనే నాకెక్కళ్ళేని సంతోషం వొచ్చేసింది. అప్పటికప్పుడే వెళ్ళి వాళ్ళందరికీ చెప్దామనుకున్నాను. కాని చీకటిగా! అందుకని ఆగిపోయా. ఆ మర్నాడు ప్రొద్దున్నే పరిగెత్తుకెళ్ళి చెప్పేశాను చెల్లీ! నే చెప్పేది నిజం చెల్లీ!

అప్పటికప్పుడే నిన్నెత్తుకుంటానని అమ్మ నడిగాను. మంత్రసాని లక్ష్మి వొద్దని కోప్పడింది చెల్లీ! అయినా నాకు తెలియకడుగుతాను మా చెల్లిని నేనెత్తుకునేందుకు దాని ఆజ్ఞేమిటి నాకు? తనెత్తుకోవచ్చుటగానీ నేనెత్తుకోకూడదట ఎందుకనో! అక్కణ్ణుంచి వెళ్ళి నాన్నారితో చెప్పాను. నాన్నారు కూడా 'తప్పు తాకగూడ'దన్నారు చెల్లీ! నువ్వు కావాలని ఎంత ఆరాటపడి పోతున్నానో వాళ్ళకేం తెలుస్తుంది చెల్లీ!

రోజూ నీకు కణ్ణీళ్ళు కాగబెట్టి పోస్తుంటే నే నక్కడే కూచ్చునేవాణ్ణి జ్ఞాపకం ఉందా చెల్లీ! ఆ రోజు నీకు చురకలు పెడతారని తెలిసింది చెల్లీ! చురకలంటే నీకేం తెలుసూ? – సూదిని ఎఱ్ఱగా కాల్చి పొట్టమీద వాతలు పెట్టేస్తారన్నమాట! ఎంత ఘోరం! పొద్దున్నే మంత్రసాని లక్ష్మి వొచ్చి సూది కాలుస్తుంటే నే – అబ్బ చూళ్ళేకపోయా! నేను చెల్లికి వాతలొద్దని ఏడ్చాను. నా ఏడుపెవరన్నా వింటేగా! ఆరోజున నువ్వేడుస్తుంటే నా గుండెలు గుబగుబలాడిపోయినై. నిజంగా ఆరోజున అన్నమే తిన్లేదు నేను. నీకు బదులు నాకు చురకలు పెట్టమన్నాను. అంతా నవ్వేసి వూరుకున్నారు. నేన్నీకన్నా పెద్దవాణ్ణేగా - పోనీ నాకు పెడితే ఏం? నామాట విన్లేదు చెల్లీ! నేను చూస్తూ వూరుకోవాల్సి వొచ్చింది. నేనే పెద్దవాణ్ణయినట్టయితే లక్ష్మిని చావబాదేవాణ్ణి. చిన్నపాపాయికి అట్లా వాతలు పెట్టచ్చా? దాన్ని దేవుడు తప్పకుండా శిక్షిస్తాడు. భగభగా మండే స్తంభాలకి అంటదీసి

కట్టాలి లక్ష్మిని! నన్నడిగితే దేవుడికడే సలహా యిస్తా! లేకపోతే యిట్లాంటి పన్లా చేసేది!

చెల్లీ! నిజం చెప్పొద్దూ - రాత్రిపూట నీమీద నాకోపం వచ్చేది చెల్లీ! రోజూ నేను రాత్రి పూట అమ్మ దగ్గిరే పడుకునేవాణ్ణి. నువ్వు పుట్టావు-మళ్లీ నేనమ్మ దగ్గిర పడుకోనేలేదు. అయినా, పోనీ లెమ్మని సద్దుకుపోయేవాణ్ణి. నువ్వు పాలకోసం ఏడుస్తుంటే అమ్మతో చెప్పి నీకు పాలు పట్టించేవాణ్ణి గుర్తుందా చెల్లీ! నీకు లాలపోసి. పౌడర్రద్ది వుయ్యాల్లో పడుకోబెట్టి వెళ్ళిపోయేది అమ్మ. నువ్వు నిద్రపోయేదాకా నీకోసం వుయ్యాల వూపుతూ వుండేవాణ్ణికాదు చెల్లీ?

ఎవరన్నా కొత్తవాళ్ళొచ్చి "బాబ్జీ! మీ చెల్లాయిని మేం తీసికెళ్ళమా?" అనేవాళ్ళు! నాకు బలే కోపం వొచ్చేది. నువ్వు కావాలని దేవుణ్ణి రోజూ అడిగి, అడిగి సంపాదించుకున్నాను గదా!— వాళ్ళట్లా అడిగితే నాకెట్లావుంటుందో నువ్వే చెప్పు మరి! నాకు తెలియకుండా నిన్ను తీసుకుపోతారేమో వాళ్ళెళ్ళిపోయేదాకా నిన్ను వొదిలి పోయేవాణ్ణే కాదు.

చెల్లీ! నువ్వూ, నేనూ వెన్నెల్లో కూచ్చుని అమ్మ పెట్టే బువ్వ తిందామనుకునేవాణ్ణి. నువ్వు పెరిగి పెద్దయితే నాతోబాటుగా బళ్ళోకి తీసికెళ్దామనుకున్నా. నా పలకా, బలపం, రంగురంగుల బొమ్మలూ, యింకా మరేమోనే నాన్నారు తెచ్చిన వూదే బూరా - అన్నీ నీకే యిద్దామనుకునేవాణ్ణి. నేను పెద్ద వుద్యోగంచేసి నీకు రకరకాల బొమ్మలూ, సిల్కు పరికిణీలూ, యింకా చాలా చాలా కొని పెడదామనుకునేవాణ్ణి. నిజం చెల్లీ! ఏమనుకుంటే ఏం?

చెల్లీ! ఆరోజు పాపిష్టిరోజు చెల్లీ! నీకు వున్నట్టుండి ఏదో జబ్బుచేసింది. అమ్మా, నాన్నా, తాతా అంతా కంగారుపడుతున్నారు. అమ్మ నడిగితే చెప్ప లేదు. నాకేం తోచక, ఏడుపొచ్చింది చెల్లీ! రాదు మరి - నాకు నువ్వు వొక్కగానొక్క చెల్లాయివి. నీకోసం నేనెంతగా ఎదురుచూశానో నీకేం తెలుసు? అందుకనే ఏడుస్తూ మన సందు చివరున్న డాక్టరు గారింటికి పరిగెత్తాను. మిట్టమధ్యాహ్నం అయినా నీకోసమని వెళ్ళాను. తలుపు కొట్టీ, కొట్టీ - పిలవగా, పిలవగా డాక్టరుగారి పెళ్లాం తలుపుతీసింది. డాక్టరు గారు కావాలని చెప్పి, మా చెల్లాయికి జబ్బు చేసిందని చెబుతూనే భోరున ఏడ్చేశాను. ఆవిడ చీదరించుకుని, డాక్టరుగారు నిద్రపోతున్నారని చెప్పి తలుపేసేసుకుంది. నా బాధ ఆవిడకేం తెలుస్తుంది! ఏం చేసేది? తిరిగి యింటికొచ్చేసరికి అమ్మ నిన్ను వొళ్ళో పెట్టుకుని ఏడుస్తూ వాకిట్లో కూచ్చుంది. నువ్వు కళ్ళు మూసుకునున్నావు. అమ్మ వంకన్నా కళ్ళెత్తి చూళ్ళేదేం చెల్లీ! నేనక్కడే నిలబడ్డాను. ఇంతలో నాన్నారొచ్చి నన్నెత్తుకుని

> నీకు తృప్తివుంటే, నీవు ఆనందంగా జీవితం గడపడానికి చాలా అవకాశా లున్నాయి. —"ప్లాటస్"
>
> ♦ ♦ ♦
>
> ఎందుకూ ఉపయోగపడని పనులలో గతించినదానికి ఏడవడం ఒకటి.
> —"చార్లెస్ డికెన్స్"
>
> ♦ ♦ ♦
>
> అదృష్టానికి తల్లి కష్టపడి పని చేయడం. —"బెంజిమిన్ ఫ్రాంక్లిన్"
>
> ♦ ♦ ♦
>
> ఇండ్లు అనేవి ఇతరులకు చూపించడానికి కాదు. మనము నివసించుటకే.
> —"ఫ్రాన్సిస్ బేకన్"
>
> ♦ ♦ ♦
>
> ఖర్చుపెట్టాక బాధపడే బదులు, ఖర్చు పెట్టడానిక్కి ముందుపడే బాధని "బడ్జెట్" అంటారు. —"వాల్టే"

నే రానంటున్నా వినకుండా దొడ్లోకి తీసుకుని పోయారు. ఇందులో నాదేం తప్పులేదు.

అంతే! మళ్ళీ కనిపించనేలేదేం చెల్లీ! లోకంలో అందరికీ చెల్లాయిలున్నారు - నాకే లేంది. ఉన్న ఒక్కదానివీ వొదిలిపెట్టి వెళ్ళిపోతే నేనేమయ్యేది! మళ్ళీ కనిపించవా? ఇక్కడికన్నా నువ్వెళ్ళిపోయిన చోటే బాగుందా? మాట్లాడవేం. సమాధానం చెప్పు చెల్లీ!

అమ్మా, నాన్నా నీకోసం బెంగపడిపోయారు,

వాళ్ళకన్నా ఒక్కసారి వొచ్చి కనిపించి పో చెల్లీ! నువ్వు రాకపోతే నేనెవరితో ఆడుకోవాలి చెప్పు మరి! చెల్లీ! అమ్మ మరీ అన్నం, నీళ్ళూ మానేసింది నీకోసం. ఇంతమందిని ఏడిపిస్తున్నావా? తప్పు కాదూ? అమ్మ దగ్గిర నువ్వు పడుకోకపోతే గదంతా బావురుమంటోంది. నీకోసం నేనెన్ని బొమ్మలు దాచానో చూద్దువుగాని రా చెల్లీ!

మొన్న ఓ రోజున అమ్మ నడిగాను - "చెల్లాయి ఎక్కడికెళ్ళిం"దని. అమ్మ ఏడుస్తూ "దేవుడు తీసి కెళ్ళాడం"ది. దేవుడింత చెడ్డవాడనుకోలేదు. నేను రోజూ నువ్వు కావాలని, నాతోపాటు ఆడుకోవాలని దేవుడికి దణ్ణాలు పెట్టేవాణ్ణి గదా! ఆమాత్రం దయవుండద్దూ! నిన్ను తీసికెళ్ళేప్పుడు నేనుండాల్సింది చెల్లీ! ఏమైనాసరే తీసికెళ్ళటానికి వీల్లేదని పోట్లాడేవాణ్ణి.

తాతయ్య ఎప్పుడో వోసారి చెప్పాడు- మంచి వాళ్ళ నందర్నీ దేవుడు తీసుకుపోతాడని. అయితే నేను మంచివాణ్ణి కానా? దేవుడికి నా మంచితనం గురించి తెలిసుండదు. నువ్వైనా చెప్పు చెల్లీ! - "మా అన్నాయ్ కూడా మంచివాడే!" అని. అక్కడంతా మంచివాళ్ళేనా చెల్లీ! దేవుడు లేకుండా చూసి వో రోజున ఎప్పుడన్నా వొచ్చి పో! నేనుకూడా నీతోపాటే వొచ్చేస్తా. నువ్వు లేంది నాకేం తోచటంలేదు చెల్లీ!

దేవుడు నన్ను కూడా తీసికెళ్తే బాగుండును. అక్కడికొచ్చి నిన్ను తీసుకుని, మనింటికొచ్చి, అమ్మా, నాన్నల కప్పజెబుతాను. అల్లా కుదరదంటే నేనుగూడా అక్కడే వుండిపోతా. చక్కగా మన మిద్దరం ఆడుకోవచ్చు. దేవుడితో నా విషయం చెప్పటం మర్చిపోకు చెల్లీ! అక్కడి కొచ్చేప్పుడు నీకు యేం తెమ్మంటావో చెప్పి మరీ పంపించు దేవుణ్ణి. అవన్నీ తీసుకొస్తా. నేనుకూడా మంచివాణ్ణే నని చెబుతావుగదూ? మరిచిపోకు తొందరగా పంపించాలి చెల్లీ! చెల్లీ! చెల్లీ!

అన్ని నొప్పులకు

అమృతాంజనము

ఏజంట్లు కావాలి!

హైదరాబాద్, రాజమండ్రి. తిరుపతి, బెంగుళూరు మున్నగు మా ఏజంట్లులేని నగరాలలో మా గృహలక్ష్మి మాసపత్రికను స్వంతబాధ్యతపై విక్రయించుకొనుటకు న్యూస్ వెండర్లు కావలెను!

వివరములకు వ్రాయుండి!

మేనేజరు, గృహలక్ష్మి కార్యాలయము,
మద్రాసు – 14.

కటకరసాయనం

బాహ్య, అంతర్గత మూలవ్యాధి చికిత్సకు దివ్యౌషధము. ఇందులో ప్రమాదకరమైనట్టియు, అలవాటుకలుగజేయు ఓషధులేవియు చేరియుండలేదు. రుచికరంగాను, సులభముగా సేవించుట కనువుగానున్నది. వివరములకు:

కేసరి కుటీరం ప్రైవేటు లిమిటెడ్
మద్రాసు – 14.